3

రావణదర్శనం

మర్నాడు కథ పంపించితీరా లన్నారు 'చిత్రగుప్త' యెడిటరుగారు. అందుకని, మామూలు కాకపోయినా, ఆరాత్రి సుందరమూ, రాజా వెళ్ళింతరవాత నిద్రపోక, కాయితం ముందుపెట్టుకుని ఆవలిస్తున్నాను. పెట్రోమాక్సు దీపం అప్పుడప్పుడు భగ్గుమంటోంది, కోమటి నూనెలో నీళ్ళు కలపడంచేత. ఏమి వ్రాయాలా అని యోచించి యోచించి, యేదైనా గట్టిది వ్రాయాలని, సీతకి రావణుడిమీద ప్రేమవున్నట్టు వ్రాస్తే, కొందర్ని వుడికించే సంతోషమన్నా కలుగుతుందని, ఒక సంభాషణ వ్రాయడం ప్రారంభించాను, ఇట్లా—

యేకాంత రంగం - "చలం"

"లంకలో అశోకవనం. గొప్ప వెన్నెల. చెట్ల నీడలు శృంగారంగా గాలిలో కదులుతున్నాయి. ప్రపంచంలోని పరిమళంగల పూలన్నీ నలుదిక్కులా పూశాయి. దూరంగా రావణుని మందిరపు బంగారు గోపురాలు వెన్నెలలో మెరుస్తున్నాయి.

ఒక పెద్ద వృక్షంకింద సీత కూచునివుంది. మెల్లిగా 'రావణా' అని వ్రాస్తున్నాను.

దీపంలోనుంచి పెద్దమంట కప్పుదాకా లేచింది. గది అంతా పొగతో నిండింది. నా కళ్లు కనపళ్లేదు. రెండునిమషాల్లో పొగ అంతా దగ్గిరగా చేరి ఒక ఆకారంగా ఏర్పడ్డది, నా కెదురుగా.

"నాపే రెందుకురా వ్రాశావు?"

అన్నది ఆ ఆకారం దశకంఠాలతో.

కాయితంవంక చూశాడు. నా కళ్ళని కిందికి దింపాడు రావణుడు, తనచూపుతో.

"కథ—"

"కథా! ఏంచేస్తావు వ్రాసి?"

"చిత్రగుప్తకి పంపుతాను."

"నిన్ను పంపుతా ముందు, చిత్రగుప్తుడిదగ్గిరికి. నాజోలి నీ కెందుకు? ఏం వ్రాయాలనుకున్నావు? నిజం చెప్పకపోతావా—"

గదయెత్తాడు. తక్కినవాక్యం నామనసులో పూర్తి అయింది.

"చెపుతాను."

చెపితే యేమంటాడో! అబద్ధంచెపితే?...కాని మనసులో విషయాలు తెలుసుకోగలడేమో? ఐనా భయమెందుకు? బహుశా సంతోషిస్తాడు. అంతకన్న అతనికి యేంకావాలి?

"సీతకి మీామీాద ప్రేమవున్నదని వ్రాయబోతున్నాను."

ఆ వక్షుంమీద మెరిసే మణిని ఒకటి పీకి నా మీద పారేస్తాడనుకున్నాను. కాని నా జాతకం వేరు విధంగా నడుస్తోంది.

పదిహేనేళ్ళనుట్టి నేను విసిరిన పువ్వులన్నీ ముళ్ళయి వ్రాలాయి ప్రజలమీద. Tact లేకపోవ డానికి ప్రసిద్ధి కెక్కిన నక్షత్రంలో పుట్టాను.

"ఏమిటిది? సీతకి...నామీద ప్రేమా! నీ కిదేం దుర్బుద్ధి!...ఈ సంగతి నాకు బ్రహ్మలోకంలో విన వొచ్చింది. భయం, భక్తి లేకండా పురాణ వ్యక్తుల్ని గురించి - ముఖ్యంగా నన్ను గురించి యిట్లాంటి అవాచ కాలు పేలుతున్నావని—సీత నావొళ్ళో కూచుందని వ్రాశావుటకదూ?"

వ్రాసినట్టు జ్ఞాపకం లేదు. కాని చదివినట్టున్నా ను. వ్యవధి లేదు; యోచించడానికి. గద లేస్తోంది.

"నేను కాదు."

"ఎవరు?"

"ఇంకో ఆయన."

"ఎక్కడ వుంటాడు?"

"తిరుగుతో వుంటాడు."

"కాని, ఎవడో సీత నా చితిలో దూకిందని వ్రాశాడుటగా!"

చచ్చాను.

"నాకు తెలీదు."

"తెలుసు. చెపుతావా లేదా?..."

నా తల వొణికింది.

"ఎవడో. దుర్మార్గుడు. బుద్ధిహీనుడు."

"వాడి పేరు?"

"తెలీదు."

"తెలీదూ! నాకు తెలుసు లే. ఐనా చెప్పు."

చదివాడేమో! దేవుడా!

అబద్ధం సరిగా చెప్పడం చాతకాదయ్యేను!

"ఎవడో, చలం."

"వాడెక్కడున్నాడు?"

"చచ్చిపోయినాడు."

"మరి ఆ కాయితంమీద 'చలం' అని వ్రాశావే. అదేమిటి?"

మళ్ళీ చచ్చాను. కోర్టుల్లో నే నెందుకు పనికి వొస్తాను?

గద యెత్తాడు.

"నేనే. నేనే. చలం."

"ఈసారి అబద్ధాలు చెప్పావా, నువ్వీలోకం లోంచి చలిస్తావు. ఎందుకు వ్రాశావు ఆ అబద్ధపు కూతలు?"

"మీరు సంతోషిస్తా రనుకున్నాను."

"నేనా?—సంతోషిస్తానూ? ఇది ఇస్తాను." అని కాలెత్తాడు.

"అది కాదు. అసలు మీరు లేరనుకొన్నాను."

"లేకపోతే, రామాయణం ఎట్లా వుంటుందిరా!"

"వాల్మీకి బుర్రలోంచి"

"నీకు తాత వుండేవాడా?"

"ఆ...

"నీ తాత యెవడి బుర్రలోంచి పుట్టాడు? నీ తాత లేంది నువ్వెట్లా వున్నావు? నేను లేంది రాకుసు లెట్లా వున్నారు?"

ఈ అర్ధరాత్రి ఆ సమస్యలు ఎందుకంట నాకు?

"ఏరీ రాకుసులు?"

"ఈ డఫేదార్లు, ప్లీడర్లు, టికెట్ కలెక్టర్లు, పిల్లల్ని బాధించే టీచర్లు, పోలీసు యిన్‌స్పెక్టర్లు— వీళ్ళందరూ యెవరు మరి?"

ఆ పదితలకాయల్లో ఏమన్నా సరుకువున్నా లేకపోయినా యిరవై చేతుల్లోనూ యిరవై ఆయుధాలూ వున్నాయి. ఎన్ని గుండెలతో ఆర్గ్యూ చెయ్యను? వొప్పు కుని తలవొంచాను. వొప్పుకోడంకూడా కష్టమనిపించ లేదు!

"సరేలే. ఆ కాయితం చింపు ముందు."

చింపాను.

మళ్ళీ వ్రాసుకోవొచ్చు.

ఇదివరకు చింపిన కాయితాలు ప్రేమ చూపి చింపించారు. భయపెట్టి చింపించడం ఇదే మొదటి సారి—అందులో మొగవాడి ఆజ్ఞప్రకారం చింపడం.

"ఇంక యిట్లాంటి తప్పుడు వ్రాతలు వ్రాయనని ప్రమాణం చెయ్యి."

ఇది వేరు సంగతి. ఆ ప్రమాణంకోసం చాలా మంది ప్రయత్నం చేశారు. కాని గదలు చూపలేదు.

ఎట్లా ఎదిరించడం? మర్నాడు పొద్దున గుర్తు లేని మాంసపు చలిమిడి ముద్దని ఎత్తి తగలపెడతారు, బహుశా, 'చలం' తాలూకుది ఐవుండాలని. ఆంధ్ర దేశ నీతి శ్రేష్ఠులకి, నవీన సారంగధరులకి, కలియుగ ప్రవరు లకి చాలా సంతోషం సమకూర్చినవా ణ్ణవుతాను. ఆంధ్ర సీతలూ, దమయంతులూ, సావిత్రులూ ప్రియుల్ని నిశ్శంకతో కావిలించుకుంటారు. నే నిప్పుడే చావ డానికి వీల్లేదు. చెయ్యవలసినపని చాలా వుంది. కొంచెం Tim the tailor వ్యవహారం సాగించి, ఆ పది బుర్రల్నీ గడబిడ చెయ్యాలి.

"తప్పుడు వ్రాతలంటే యేవో తెలీటంలేదు. చెప్పండి."

నాతో వాదించ వొచ్చిన వారిని, 'నీతి అంటే యేమిటి?' అని అడ్డప్రశ్న వెయ్యడ మనుకున్నాను.

చూరుకి తగిలే కత్తిని నావేపు వూయించాడు.

"ముందు వినండి; నా సందేహాలు తెలియచేసు కుంటాను. మీకు పదితలకా—శిరస్సులున్నాయి. ఏ వొక్క దాంతో ఆలోచించినా అర్థమాతుంది."

"సరేకాని, నాకు నచ్చకపోయిందా, నీ వొక్క తలా పదితల లౌతుంది."

"ఆలోచించండి—"

"ఆలోచించాలా—ఆలోచిస్తా. ముందు ఆ సిగరెట్ పెట్టె యిట్లా పడెయ్యి."

అవును. నా గాబరాలో ఆతిథ్యమే మరిచిపోయి నాను. ఎక్కడ కూర్చోమనను? ఏకుర్చీ ఆగుతుంది?

సిగరెట్ పెట్టె యిచ్చాను.

"లోడితెడున్నావు. నీకు కత్తెరమార్కు చాలదూ, ఏనుగమార్కు కావలసి వొచ్చిందా?" అన్నాడు.

అంటో, నాలుగు చేతుల్లోంచి శక్తీ, శూలమూ, ఖడ్గమూ, ముద్గరమూ నా జల్లమీద పెట్టి, నాలుగు చేతులతో ఎనిమిదిసిగరెట్లూ తీసి, యెనిమిది నోళ్ళ ల్లోనూ పెట్టాడు.

"ఇంకా తే. బుద్ధిలేదూ?"

అన్నాడు మిగిలిన రెండు నోళ్లతోనూ.

"ఇంక లేవు"

"లేవూ? లేకండా యేం చేస్తున్నావు?"

పరశు యెత్తాడు.

"రామ రామ" అని భజన మొదలుపెట్టాను. రెండుమూడు కారణాలవల్ల — కాని సీత నంటగట్టానని రావణుడికే కోపం వొచ్చిందే. యింక రాముడా నన్ను కరుణించేది? అతని పక్కనే రాముడు ప్రత్యక్షమై, రావణుడి బుజంమీద ప్రేమగా చెయ్యివేసి—

"సందేహిస్తావేం? వెయ్యి ఒకటి" అంటూ డను కున్నా. ఆ వెనక సీత నుంచుని "వాణ్ణి నాశనం చెయ్యి రావణా! అప్పుడుగాని నాకు కసితీరదు..." అంటే!

"ఏమాలోచిస్తున్నావు?"

అని దువ్వాడు నాలుగో తల కుడిమీసం. నా వొక్క మెదడూ చాలా చురుకుగా పనిచేసింది, ఆ నాలుగో తల కుడిమీసం మూడు మెలికల్నీ చూసి.

"బజారుపోయి కొనుక్కొస్తాను" అని బృహస్పతిమల్లే పలికాను.

"అహా! అదే పోక పోదామనా! వీల్లేదు."

నా కెవన్నా మంత్రాలు తెలిసి వుండకూడదా?

చుట్టూ చూశాను. ఎవన్నా పాతసిగరెట్లు, సగం కాల్చిన ముక్కలన్నా వున్నాయేమోనని. అంత్యకాలంలో తెలివి యెక్కువవుతుంది అంటారు. 'సెల్' కదిలింది. శేషమ్మా, నన్ను రక్షించావు. వరండానిండా వుమ్మువేసినందుకు నిన్నెప్పుడూ తిట్టను!

"తమకు కోపమొస్తుందేమో!"

"కానీ......"

"బీడీలు తాగుతారా?

"బీడీలు తాగుతావురా! బ్రాహ్మడివి!"

"బ్రాహ్మణీకం వొదిలేశానండి. తమకు తెలీనిదేముంది? కాని ఆ నాన్‌బ్రామిన్సు నన్ను చేరనీలేదు, గొప్ప వుద్యోగం కొట్టేస్తానేమోనని!"

"సరేలే. అసలు బ్రాహ్మణ పుటకేగా! బీడీ లెట్టా తాగుతావు! ఇంత పాడైన వాడివా? నువ్వు బతకడానికి వీల్లేదు."

శూలం యెత్తాడు.

"కాదు, నేనుకాదు. శేషమ్మ తాగుతుంది."

"ఆడదాన్ని తాగనిస్తావురా?"

"ఆమె నా పనిమనిషి. నా పెత్తనంయేముంది?"

"అంట్లవెధవా! ఆడదానిమీద పెత్తనంలేని వాడివి, సీతని నావూళ్ళో కూచోపెట్టావా?"

శక్తినెత్తాడు.

"నేను కా"దని మనవిచేసుకున్నాను.

"ఐతే యెవరు?"

మళ్ళీ మొదలా!

"ఇంకొకడు."

"వాణ్ణి తీసుకురా."

"దొరకడు."

"ఆ శేషమ్మ యెవరు?"

"పనిమనిషి."

"ఏం కులం?"

"తెలీదు."

"ఎందుకు తెలీదు?"

"నే నడగలేదు."

"ఎందుకు అడగలేదు?"

"ఏం అవసరం?"

"అదికాదు. ఆడదాన్నిచూస్తే నీకు భయం. నీభార్య యేదీ?"

"మావూళ్ళో వుంది."

"ఎందుకు తీసుకురాలేదూ? ఎవరన్నా యెత్తుకు పోతే!"

"ఈకాలపు రావణులకి ఆమాత్రం సాహసం లేదు."

"ప్రేమవుంటే సాహసం వొస్తుంది."

"పెళ్ళాల్ని ఎత్తుకుపోతే రెండేళ్ళు శిక్ష!"

"ఈనాడే ఐతే మీకైనా అంతే."

"ఆ. నాకు శిక్షా! ఒరే నీ నాలిక కొవ్వెందే! అప్రయోజకుడివిరా నువ్వు! ఇట్లాంటి పాడుకథలు వ్రాస్తావు గనకే నీతో ఎవరూ వుండరు, యీ బీడీలు తాగే శేషమ్మతప్ప. నిన్నింక బతకనీకూడదు. ఎట్లానూ చంపుతాను నిన్ను. ఆ బీడీ లిట్లా పారెయ్యి."

"సగం కాల్చినవి."

"నోరుముయ్యి. ఇట్లా పడెయ్యి. ఆట్టేవాగక."

వెతికి యిచ్చాను.

రెండూ మిగిలిన రెండునోళ్ళల్లోనూ పెట్టాడు. అగ్గిపెట్టె యిచ్చాను. సిగరెట్లు ఎనిమిదీ వెలిగించాడు. బీడీలు వెలిగించబోతున్నాడు.

"అయ్యో, మీసాలు కాలతాయి."

"అగ్ని నన్ను తాకడమే!" అని గర్జించాడు. పదినోళ్ళలోంచీ పొగలు! ఆ రూపం చూడలేక నవ్వు ఆపుకుంటున్నాను, అధిక ప్రయత్నంతో.

"ఆ శేషమ్మ యేదీ?"

"ఇంటికి పోయింది."

"ఉంటేనేం?"

"నీతిభయం."

"ఇంకా వుందీ ఆ భయం?"

"ఈకాలంలో అగ్నిపరీక్షలుకూడా లేవు."

"సరేరా, నేను పోవాలి. దేంతో చస్తావు నీవు–అస్త్రంతోనా, శస్త్రంతోనా!"

"............"

"తొరగా కానీ."

ఎట్లాగో కాలయాపన చెయ్యాలి.

"అస్త్రానికీ, శస్త్రానికీ భేదం ఏమిటి?"

"చూపించనా?"

"ఎందుకండీ నన్ను చంపడం?"

"మరి సీతని నా చితిలో మెందుకు తోశావు?"

ఎట్లా తప్పించుకోడం?

"మీకు కోపమెందుకు? సీత ప్రేమని మీరు కోరారా లేదా?"

"ఐతే?"

"ఆ ప్రేమని పొందారంటే మీకు కోప మెందుకు?"

"ఓరి మూర్ఖా! బుద్ధివిహీనా! ఆమె నన్ను ప్రేమించిందంటే ఆమెకి పాతివ్రత్య మేదిరా?"

"పాతివ్రత్యం వొదల్చాలనేగా మీ గోల?"

"సరేలే. కాని పతివ్రత కానిదాన్ని కోరేటంత అధమున్నిరా నేను? నీ తల బద్దలుకొడతా చూసుకో."

"మీరు బద్దలుకొట్టకండానే బద్దలవుతోంది నా తల, యీ వింత సమస్యతో........"

"మరి రామాయణమంతా యేమిటి?-ఎందుకు ఎత్తుకొచ్చా రామెనీ?"

"మొదట తమాషాకే తీసుకొచ్చాననుకో."

"అంత తంటాలుపడ్డారే!"

"అవును. గొప్పగొప్ప దేవతాంగన లందరూ నన్ను ప్రేమించారే—"

"ఏమో? ప్రేమించారో! మీకు భయపడి నటించారో!"

"ఆ!"

పరశువు ఎత్తాడు.

"ప్రేమించారు లెండి."

"ఆ. మరి యీమనిషి-యీ నరజాతిది-నన్ను తృణీకరిస్తుందా! అదీ నా పంతం."

"మరి ఆపిచ్చిపంతంకోసమా సర్వమూ నాశనం చేసుకుంది? మరి ఆమె మిమ్మల్ని ప్రేమించివుంటే—"

"ఆమాటే అనవొద్దన్నాను. ప్రేమించివుంటే నాగొప్ప యేముంది, ఆమెగొప్ప యేముంది?"

"ఏం గొప్పలెండి! దొంగతనంగా రాముడు లేనప్పుడు స్త్రీని యెత్తుకవొస్తిరి."

"ఎదురుగా తెస్తే యేడవడూ? ఏడిస్తే జాలేసి వొదిలేస్తానని భయం. అదిగాక రాముడిమీద నాకేం కోపం? చంపడానికి అవసర మేముంది?"

"కాదులెండి. యుద్ధంలో రాముడేగా గెలిచింది!"

"ఆ! రాముడా గెలిచింది?"

శూలాన్ని యెత్తాడు.

"లేదు. మీరే!"

ముద్గరం యెత్తాడు.

"కాదు, యిద్దరూ—"

పకపకా పదిన్నోళ్లూ నవ్వాయి.

"రామాయణం చదవలేదురా నువ్వు?"

"చదివాను."

"మరి రాముడిచేత నేమయింది? తమ్ముడు-వంశపాంసనుడు, కులద్రోహి. వాడు - నా రహస్యం వెల్లడిచేశాడుగాని! పైగా మీపురాణాల్లో వాణ్ణి మెచ్చుకుంటారు."

"మీ అన్యాయాన్ని సహించలేకపోయినాడు."

"నేనేం అన్యాయం చేశాను? రాముడు ఎదురుగా వుండగా నే నెట్లా అడగను నన్ను ప్రేమించమని సీతని? అందుకని విడతీసి అడిగాను: అది తప్పా? సీతని రాము డేం సుఖపెట్టగలడు? వాడిది నష్ట జాతకం. ఎదో వొంకపెట్టి యేడుస్తాడు, యితరుల్ని యేడిపిస్తాడు. సీత! సీత!"

తలుచుకుని కొంచెం మైమరిచాడు.

"ఆమెకి దేవతలు పరిచర్యలు చెయ్యాలి. గంధర్వులు వూడిగం చెయ్యాలి. త్రిభువనాలు ఆమెకి పాదాక్రాంతం కావాలి. రాము డేం సౌఖ్యపెట్టగలడు ఆమెని?"

"కాని మీ విభవాల్ని ఆమె ఆశించిందా?"

"ఆమె కేం తెలుసు? ఇప్పుడు ఏమంటున్నారు మీరు? అదికాదురా, స్త్రీ స్వతంత్రం కావాలంటే, కన్య వరుణ్ణి తానే కోరుకోవాలంటే దాని కేం తెలుసు నంటారే!

"సీత కేం తెలుసు, నావిభవపుశోభ!"

"అందుకని నయానా భయానా ఆమెకి బోధ పరిచాను. తప్పేముంది? పిల్లల్ని మీరు గదుల్లో బంధించి బోధించటం లేదా? బళ్ళల్లో"

"మీ కేం హక్కు వుంది సీతని బంధించడానికి?"

"నేను ప్రేమించాను గనక."

"రాముడు ప్రేమించ లేదా?"

"వాడిది క్షుద్రప్రేమ, నీచప్రేమ, స్వార్థప్రేమ. నాది వుదారమయింది, వున్నతమయింది, వుత్కృష్ట మయింది. తనతో కష్టాలు పంచుకోమంటాడు వాడు; నాతో సౌఖ్యాలు పంచుకోమంటాను నేను. నేనై తేనా, ఆ కైకనీ, దశరథుణ్ణీ సముద్రంలో తోసి సీతను సుఖ పెట్టనా? భార్యకన్న తల్లీ, తండ్రీ, ధర్మమూ, కీర్తీ ఎక్కువైన వాడి ప్రేమ ఒక ప్రేమా!"

"మరి సీతకి—"

"సీతకీ? సీత కేం తెలుసు ఆడదానికి—"

"రాముడికి—"

"రాముడి కేం తెలుసు, స్వార్థపరుడికి? తన భార్యని యెత్తుకుపోయినానని కోపంతప్ప! నిజంగా ప్రేమే వుంటే వాడు సీతని పిలిచి 'నీకు నేను కావాలా, రావణుడు కావాలా?' అని అడగడూ?"

"మీకు తెలీదూ యెవర్ని యేరుకునేదో!"

"అవును లే. కాని అడిగితే, నేనే యిచ్చేవాణ్ణి సంతోషంతో. ఇద్దర్నీ సర్వలోకాలకీ అభిషిక్తుల్ని చేసి, తపస్సుకు పోయేవాణ్ణి. వా డంత క్షుద్రుడుగనకనే,

అనుమానాలతో సీతని యేడిపించుకు తింటాడని తెలుసునుగనకనే నే నివ్వలేదు.''

''ఏం లాభం? మీకు సర్వనాశనమూ అయింది. సీత రాముడికే దక్కింది.''

''నాధర్మం నేను నెరవేర్చుకున్నాను. గీతలో చెప్పినట్లు నిష్కామకర్మ.''

''ధర్మమా, కామమా!''

''కామమా! కామమా! నాకేం కామం తీరిందయ్యా?''

''రాముణ్ణి నేను చంపితేమాత్రం, సీత నన్ను వరిస్తుందని ఆశ వుందా నాకు? అతని చితిమీదే తానూ భస్మంకాదా? కామమా? నీ కేం బుద్ధిలేదూ, యిన్ని కథలు వ్రాస్తావు?...

''ఎన్నడన్నా, యీలోకంలో, ఒక స్త్రీకోసం సర్వసంపదల్నీ, తమ్ముల్నీ, కొడుకుల్నీ, భూచక్రాన్నీ వొదులుకున్న మనిషిని నీవు చూపగలవా? దేవతలచేత, అప్సరసలచేత, మండోదరివంటి ఉజ్వలచారిత్రచాత వరింపబడ్డవాణ్ణి నేను!''

''ట్రాయ్ కథ వుంది.''

''తెలుసు నాకు. అక్కడ స్త్రీని అనుభవించాడు 'పారిస్' నేనూ, నేనూ!...''అంటూ యేడ్చాడు పది నోర్లు వొణుకుతో.

''ఒక్క చిరునవ్వునన్నా పొందలేదే! ఆమె నా విమానంలో కూచున్నదే చాలు, నా తోటలో వసిం

చిందే చాలు అనుకున్నాను. నాకేమీ ఆశ లేదు. అక్కర్లేదు. ఆమె ఏమీ ఇవ్వదు. కాని, కాని...

అంతకన్న ఉన్నతమైన ప్రేమని యోచించుకో!''

నేనూ చాలా Move ఐనాను. కాని ఆర్గ్యుమెంటు కోసం...

''ఏం ప్రేమ లే! ధర్మపరుడైన విభీషణుడుకూడా ఎందుకు వొప్పుకోలేదు, మరి ఆ ప్రేమే గొప్పదైతే!''

''విభీషణుడా? వాడు! అంత దుర్మార్గుణ్ణి ప్రపంచం యెరుగునా! వాడు ధర్మాత్ముడూ, నేను దుర్మార్గుణ్ణీ ఐనాను కాదూ! అందువల్లనే మీ దేశం యిట్లా ఏడుస్తోంది. పిరికి వెధవ. మొదటినుంచీ అంతే. అర్భనాకారి వెధవ. ఎప్పుడూ భయమే! చెట్టెక్కితే పడతానని ఏడ్చేవాడు. శకునపక్షిలాగు కూస్తూనే వుంటాడు...ద్వాపరంలో మీ భీష్మ ద్రోణులు పాండవుల వేపు చేరారా? ధర్మంగాని, అధర్మంగాని ఎవడి తిండి/తిన్నారో వాడి వేపే చచ్చారు. మా విభీషణుడో! కులద్రోహి. ఇంకా వాణ్ణి మెచ్చుకుంటున్నావా?''

''భీష్మాదులుమాత్రం రహస్యంగా పాండవులకి సహాయం చెయ్యలేదా?''

''అందువల్లనే పూజ్యులైనారు మీకు. స్వామిని నమ్మినవాళ్ళకి గౌరవం లేదు మీ దేశంలో! ఇట్లాంటి దేశద్రోహుల్ని గౌరవించే శాస్త్రాలు చదివే, మీ రాజులందరూ విరోధులతో చేరి దేశద్రోహులైనారు. ఈనాటికీ అట్లాంటివాళ్ళకే గౌరవమూ, మెప్పూ.''

నోరు మూసుకున్నాను.

"ఏం రా?"

"కాని పరదారాపహరణం—"

"ఇంకా అదే కూస్తున్నావా? చావు" అని గదతో నెత్తిమీద ఒక్క పెట్టు పెట్టాడు.

వులిక్కిపడి లేచాను. లైటు మండుతోంది. ఎంత సేపు నిద్రపోయినానో!